# బిజినెస్

**- అడబాల అప్పారావు**

మధ్యాహ్నం మూడవుతోంది. వస్తానన్న లలిత ఇంకా రాకపోవడంతో మురళి అసహనంగా ఎదురు చూస్తున్నాడు. ఆ రోజు సినిమా ప్రోగ్రాముంది ఇద్దరికీ. రెండ గంటల కొస్తానని చెప్పి మూడైనా ఇంకా రాలేదు. సినిమా టైమ్ ఎలాగూ దాటిపోయింది. కనీసం ఏ హోటలుకైనా వెళ్ళి టైం పాస్ చేసొద్దామంటే తనింకా వూడి పడలేదు. ఓ పక్క లలిత మీద కోపం పెరిగి పోతోంది.

''హలో మురళీ!'' ఎదురుగా లలిత.

''ఇంకేం చెప్పకు. నాకు సంజాయిషీలు ఏం వద్దు తల్లీ! ఇదేం మొదటిసారి కాదు గదా నేను నీకోసం వెయిట్ చేయడం. నీ సమర్థింపులు వినడం!''

''సర్లే! నాకోసం వెయిట్ చేయడం వల్ల నీకు బెనిఫిట్ అయిందిలే!''

''ఏమిటది?'' చిరాగ్గా మొహం పెట్టి అన్నాడు.

'' నీ మొహం కందగడ్డలా అవలేదూ.''

''డిసినట్టుందా బెనిఫిట్.''

''మరి కాదా? కంద కిలో ఎంతనుకున్నావ్?''

''నీ మొహం'' అంటూ లలిత చెవి నులిమాడు మురళి.

''ఏం చేయను మురళీ. క్లాస్ బిగిన్ అయిన తరువాత బైటికి పిలవ్వే అని శాంతికి చెబితే అది మరచిపోయి నన్ను పిలవ లేదు. ఇంక క్లాసు అయ్యే వరకూ బుక్ అయిపోయాను. అందువల్లే లేటయ్యాను.''

''సర్లే నడు. అలా హోటల్‌కి వెళ్ళి వద్దాం'' అన్నాడు.

ఇద్దరూ హోటల్ వేపు నడిచారు.

లలిత, తనూ డిగ్రీ సెకండియర్ చదువుతున్నారు. మురళి బి.కాం., లలిత బి.ఎస్.సి. ఇంటర్లో క్లాస్ మేట్స్ కావడం వల్ల ఆ పరిచయం ఇంకా అలాగే కొనసాగుతోంది. డిగ్రీలోకి వచ్చాక వారి స్నేహం ప్రేమగా మారింది.

★★★★★

''అవును డిగ్రీ అయిపోయిం తరువాత ఏం చేద్దామనుకుంటున్నావ్ మురళీ?'' అడిగింది లలిత కూల్ డ్రింక్ సిప్ చేస్తూ.

''నిన్ను పెళ్ళి చేసుకుని సుఖపడ దామనుకుంటున్నాను.'' చిలిపిగా అన్నాడు మురళి.

''ఏయ్! అవన్నీ తరువాత మహానుభావా! ముందు పనికొచ్చే పనులేం చేస్తావో చెప్పు.''

''ఏముంది! ఉద్యోగానికి ట్రై చేస్తాను. లేకపోతే నాన్నగారి సాయంతో ఏదైనా చిన్న బిజినెస్ స్టార్ట్ చేస్తాను. ఇంతకీ తమరి ప్లాన్ ఏమిటో సెలవిచ్చారు కాదు?''

''నేను మాత్రం ఉద్యోగమొచ్చేదాకా పెళ్ళి చేసుకోను.''

''చచ్చాన్రా దేవుడోయ్!'' బిక్క మొహం వేశాడు మురళి.

''ఏం?''

''నీకు ఉద్యోగం వచ్చేదెప్పుడూ? నేను నిన్ను పెళ్ళి చేసుకునే దెప్పుడూ?''

''ఇప్పట్నుంచే కాంపిటీటివ్ ఎగ్జామ్స్ రాస్తున్నానుగా. డిగ్రీ కంప్లీట్ అయ్యేలోగా లేదా తరువాతైనా ఒకటి రెండేళ్ళలో వస్తుంది లే.''

''ఒకటి రెండు సంవత్సరాలు కాదు తల్లీ! ఏ పది పన్నెండేళ్ళో పడుతుంది. అప్పుడు నువ్వు వృద్ధ కన్యలా తయారవుతావ్!''

''చాల్లే వేళాకోళం'' చిరుకోపంతో అంది లలిత.

★★★★★★

కాలచక్రం శరవేగంగా దూసుకు పోతోంది. రెండ సంవత్సరాలు ఇట్టే గడిచి పోయాయి. డిగ్రీ ఫైనలియర్ పరీక్షలు అయిపోయాయి.

''లలితా! మన ప్రేమ విషయం కాలేజీ అంతా తెలిసి పోయింది. మనం త్వరగా పెళ్ళి చేసుకోవడం మంచిది.''

''చెప్పానుగా మురళీ! నాకు ఉద్యోగం వచ్చిందాకా ఆగాలని!''

''అది సరే. మన పేరెంట్స్‌కి మన విషయం ఎలా చెప్పాలా అని?'' అన్నాడు సాలోచనగా.

''నువ్వే మీ వాళ్ళకు ముందు చెప్పు'' అంది.

''సరే! సమయం చూసి చెబుతాలే.''

''మీ వాళ్ళు ఒప్పుకుంటా రంటావా?''

''నే నొప్పిస్తాగా!'' ధైర్యంగా అన్నాడు మురళి.

★★★★★★

సంవత్సరం దాటింది.

లలితకు ఉద్యోగం రాలేదు.

ఇంకా ఆ పరీక్షలూ, ఈ పరీక్షలూ రాస్తూనే ఉంది. ఆ హడావుడిలో ఈ మధ్య మురళిని కూడా ఎక్కువగా కలవడం లేదు. మురళి కూడ వాళ్ల నాన్నతో బిజినెస్‌లో తిరగడం వల్ల లలిత నెక్కువ కలవలేక పోతున్నాడు. అయినా వీలైనప్పుడల్లా కలుసుకుంటూనే ఉన్నా రిద్దరూ.

ఒకరోజు మధ్యాహ్నం మురళి భోజనానికి వస్తే తల్లి లక్ష్మీ కాంతమ్మ మురళి చేతికి ఒక ఫొటో ఇచ్చింది. మురళి ఆ ఫొటోని పరిశీలనగా చూసి 'ఎవరో అందమైన అమ్మాయి. పెళ్ళి కానట్టుంది.' అనుకున్నాడు.

''అమ్మా! ఎవరీ అమ్మాయి?''

''అమ్మాయి ఎలా వుందిరా?'' పొడిగా అడిగింది.

''చాలా బావుంది! ఎవరీ అమ్మాయి.''

''డిగ్రీ వరకూ చదువుకుంది'' మళ్ళీ ఇన్‌ఫామ్ చేస్తున్నట్టుగా అంది.

''ఇంతకీ ఎవరే ఈ అమ్మాయి?'' అసహనంతో రెట్టిస్తూ అడిగాడు.

''నాలుగు లక్షల కట్నంతో ఆ అమ్మాయికి పెళ్ళి కుదిరింది రా!''

''ఎవరితో కుదిరింది? ఇంతకీ అసలీ అమ్మాయి ఎవరో కాస్త చెప్పు.''

''లాంఛనాలవీ ఇంకో లక్ష ముడతాయి రా!''

'' ఇదిగో అమ్మా! ఎందుకే నన్నిలా సస్పెన్స్‌లో పెట్టి చంపుతావ్? ఇందాకట్నించీ ఆ డొంక తిరుగుడు సమాధానాలేమిటే? ఇంతకీ ఆ అమ్మాయెవరూ? ఎవరితో పెళ్ళి కుదిరింది?'' దీనంగా మొహం పెట్టి అడిగాడు మురళి.

''ఎవరితోనో పెళ్ళి కుదిరిన అమ్మాయి ఫొటో నీకు చూపించాల్సిన అవసరం ఏముందిరా బడుద్ధాయ్! నీతోనే ఆ అమ్మాయికి పెళ్ళి కుదిరింది'' అన్నాడు మురళి తండ్రి భుజంగం అప్పుడే లోపలికొస్తూ.

మురళి నిశ్చేష్టుడయ్యాడు.

''నాన్నా! నాకు మాట మాత్రం కూడా చెప్పకుండా సంబంధం ఎలా కుదిర్చారు?''

''మొన్న నువ్వు పిక్నిక్‌కి వారం రోజులు బయటికెళ్ళావు కదా! అప్పుడు సంబంధం వస్తే చూశాం. అన్ని విధాలా బాగుంది కదా అని ఒప్పుకున్నాం రా! అయినా నీక్కూడా నచ్చిందనేగా పట్టి పట్టి అడుగుతున్నావ్! ఇంకా అభ్యంతరం దేనికి?'' అనునయంగా అన్నాడు భుజంగం.

''అభ్యంతర మంటే ఏం లేదు... మరే... మరేమో...'' నసిగాడు మురళి.

''చెప్పరా ఏమిటో'' ఫ్రీగా చెప్పు'' అన్నాడు. భుజంగం.

'' ఏం లేదు నాన్న గారూ! నేనొక అమ్మాయిని ప్రేమించాను, పెళ్ళి చేసుకుంటానని మాట కూడా ఇచ్చాను.''

''మాటిచ్చావు అంతే గదా! అంతకు మించి ఏం ప్రొసీడ్ కాలేదు కదా!'' అన్నాడు భుజంగం. కొడుకుతో ఒక ఫ్రెండ్ లాగా ఫ్రీగా మాట్లాడటం అతనికి అలవాటు.

లలితను గురించి వివరంగా చెప్పాడు మురళి తండ్రికి. అంతా విన్నాక -

''అయితే కట్న కానుకలేవీ తేలేదన్న మాట! అలాగని కనీసం ఉద్యోగం కూడా లేదు.''

''లేక పోయినా ఫర్వాలేదు నాన్నా! నేను పోషిస్తాను తనని.''

''ఉద్ధరించావ్ గానీ కలల్లో బతకడం మానేసి కాస్త ఈ లోకంలోకి రా నాయనా! లోకం నువ్వు అనుకున్నంత ఆదర్శవంతంగా లేదు. అంతటా స్వార్థం నిండి వుంది. ప్రతి వారూ ఎవరితో రిలేషన్స్ పెంచుకుంటే ఎంత కలిసొస్తుంది, ఎవరితో రిలేషన్స్ కట్‌చేయక పోతే ఎంత నష్ట మొస్తుంది లాంటి బిజినెస్ ఫార్ములాస్‌ని ఫాలో అవుతూ జీవితమే ఓ వ్యాపారంగా బతుకుతున్నార్రా!'' జీవితాన్ని తాను తెలుసుకున్న కోణం నుంచి కొడుకు ముందు ఆవిష్కరించాడు భుజంగం.



''అయితే నన్నేం చేయమంటావ్?'' అయోమయంగా అడిగాడు.

''నువ్వే నిర్ణయించుకో. ఏ అమ్మాయిని పెళ్లి చేసుకుంటావో! ఎవర్ని చేసుకున్నా నాకు అభ్యంతరం లేదు. కానీ నువ్వు తీసుకునే నిర్ణయం మీద నీ భవిష్యత్తు ఆధారపడి ఉందని మాత్రం మరచిపోకు'' అన్నాడు.

ఆ రాత్రంతా మురళికి నిద్ర పట్టలేదు. ఆలోచించీ, ఆలోచించీ, ఒక నిర్ణయానికి వచ్చాడు. పొద్దున్నే తండ్రితో చెప్పాడు–

''నాన్నా! మీరు తెచ్చిన సంబంధమే నేను చేసుకుంటాను.''

అయన సంతోషంగా షేక్ హ్యాండ్ ఇచ్చాడు కొడుక్కి – తన మాట నిలబెట్టినందుకు కృతజ్ఞతగా.

★★★★★★

ఆ రోజు పార్కులో లలితను కలిశాడు మురళి.

''ఏంటి మురళీ! అదోలా ఉన్నావ్?''

''ఏం లేదు లలితా! మన ప్రేమ విషయం నిన్న ఇంట్లో చెప్పాను.''

''ఏమైంది?'' అందోళనగా అడిగింది లలిత.

''మా వాళ్లు ఒప్పుకోలేదు. నాకు వేరే సంబంధం చూశారు. ఆ సంబంధం గనుక చేసుకోక పోతే మా అమ్మానాన్నలు చచ్చిపోతామన్నారు. వాళ్లు ఎలా పోయినా ఫర్వాలేదు. నాకు మాత్రం నీ ప్రేమ ముఖ్యం. నేను నిన్నే పెళ్లి చేసుకుంటాను'' గొంతులో కాస్త ఆవేశం ఒలకబోస్తూ అన్నాడు మురళి.

''మురళీ! నీ తల్లిదండ్రులను వాళ్ల చావుకి వాళ్లను వదిలి పెళ్లి చేసుకోనవసం లేదు. వాళ్లను క్షోభపెట్టి మనం ఏం సుఖపడతాం! వాళ్లు చూసిన సంబంధమే చేసుకో. నా మూలంగా నువ్వు మీ వాళ్లకి దూరం అవ్వడం నాకిష్టం లేదు.'' అన్నది బాధను మనసులోనే అణచి పెట్టుకుని.

మురళికి ఒకింత సంబరంగా ఉంది. లలిత ఇంత తేలిగ్గా ఒప్పుకుంటుదనుకో లేదు.

కాసేపు బిక్క మొహం వేసి తనను పెళ్లి చేసుకోలేక పోతున్నందుకు తెగ పశ్చాత్తాప్పడి పోతున్నట్టు ఫోజు పెట్టి, విషాద డైలాగులు కొన్ని చెప్పి అక్కణ్ణుంచి చల్లగా జారుకున్నాడు.

★★★★★★

మురళికి తనవాళ్లు చూసిన అమ్మాయి వాసంతితో నిశ్చయ తాంబూలాలు జరిగి పోయాయి. రెండు నెలల తర్వాత పెళ్లి ఏర్పాట్లు చేద్దామనుకున్నారు మురళి తల్లిదండ్రులు.

ఇంతలో మరళికి ఒక విషయం తెలిసింది.

లలితకు బ్యాంకులో ఆఫీసర్‌గా జాబ్ వచ్చింది. నెలకు పది వేలు జీతం.

మరళి ఆలోచనలో పడ్డాడు. అనవసరంగా లలితను కాలదన్నుకున్నానేమో! లలితను చేసుకుంటే జీవితాంతం ఆమె సంపాదించేది లక్షల్లో ఉంటుంది. వాసంతి తెచ్చే కట్నం లలిత సంపాధనతో పోలిస్తే తక్కువే. మురళి తన బిజినెస్ మైండ్ అప్లయ్ చేసి ఆలోచిస్తే అంతా లాసే కనిపిస్తోంది. లలిత విషయంలోతను వేసింది రాగ్ స్టెప్పే! దీన్ని ఎలాగైనా సరిదిద్దుకుని లబ్ధి పొందాలి! చివరికి మళ్లీ తన నిర్ణయం మార్చుకున్నాడు.

★★★

ఆ మర్నాడు లలితను కలిశాడు. ఉద్యోగ మొచ్చినందుకు ఆమెకు అభినందనలు తెలియజేశాడు. లలిత ఏ ప్రభావమూ లేకుండా మాట్లాడ సాగింది.

''లలితా! నేను తప్పు చేశానేమో అనిపిస్తోంది'' బాధగా మొహం పెట్టి అన్నాడు మురళి.

''ఏ విషయంలో?'' సూటిగా అడిగింది లలిత.

''అదే! నీ ప్రేమ కోసం నేనేమీ చేయలేక పోయాను. ఏదో పెద్దల గురించి ఆ సంబంధం ఒప్పుకున్నా! నిన్ను మరిచి పోలేక పోతున్నాను. అందుకే ఒప్పుకున్న సంబంధం తిరస్కరించి నిన్ను చేసుకుందామనుకుంటున్నాను. ఈ విషయంలో ఎన్ని అడ్డంకులెదురైనా లెక్క చేయను'' ఏదో త్యాగానికి ఒడిగడుతున్న వాడిలా అన్నాడు.

''చూడు మరళీ! నువ్వు చేసుకుందామనుకున్నా నేను సిద్ధంగా లేను.''

''లలితా!'' ఆశ్చర్యంగా అన్నాడు మురళి.

''అవును! నీ మెంటాలిటీ అంతా నే స్టడీ చేశాను. నువ్వు నీకు ఏది లాభమనుకుంటే అటు వైపు మొగ్గుతావు. మొదట ప్రేమకే పట్టాభి షేకమన్నావు. తర్వాత లక్షల కట్నం ఆశించి ప్రేమను వంచించావు. ఇప్పుడు ఉద్యోం హోదా వున్న నేను దొరికితే అటు సంపాదనా, ఇటు ప్రేమకోసం త్యాగం చేశాడన్న పేరు గడించాలని చూస్తున్నావు. అందుకోసం పెళ్లి కుదిరిని అమ్మాయిని కూడా తిరస్కరించడానికి వెనుకాడలేదు. జీవితమే ఓ వ్యాపారంగా భావించే నువ్వు ఎదుటి వాళ్లకు నష్టమే మిగులుస్తావు.''

''లలితా!''

''అవును! జీవితం ఒక వ్యాపారమే! కానీ నష్టమొచ్చినా ఆగకుండా సాగే వ్యాపారం జీవితం. ఇంకెప్పుడూ నా జీవితంతో బిజినెస్ చేయాలని ప్రయత్నించవద్దు...'' ఆవేశంగా అంటూ చరచరా అక్కడినుంచి వెళ్లిపోయింది లలిత!